క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో గురువారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీత తొలగించారు. గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేసి, దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. వాటర్ ట్యాంక్‌ను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కోరారు.

విద్యార్థులకు గణితంపై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు గణితంపై శిక్షణ ఇచ్చారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు గణితంతో పాటు, నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ పొందాలన్నారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు శిక్షణ తరగతులకు పంపాలన్నారు.

ఖరీఫ్‌పై సన్నాహక సమావేశం

గండేపల్లి: రానున్న ఖరీఫ్‌పై ముందస్తు ప్రణాళికకు సన్నాహక సమావేశాన్ని ఏఓ సద్గురుమూర్తి ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి సంజీవ్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పర్యావరణాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు రసాయన ఎరువులు తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వినియోగించాలన్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు, కాలుష్యాన్ని నివారించవచ్చని చెప్పారు. వ్యవసాయాధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ బోరు సౌకర్యం ఉన్న రైతులు మూడేళ్ల వయస్సు గల పామాయిల్ పంటల్లో అంతర పంటలుగా చిరుధాన్యాలు, అపరాలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ఆదాయాన్ని పెంచుకునే విధంగా రైతులు ప్రకృతి వ్యవసాయం సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

రౌతులపూడి: ఖరీఫ్ పంట సాగు ఈ ఏడాది ముందస్తు ప్రణాళికలపై మండల రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి విత్తనాలు, ఎరువుల సరఫరా, ఎరువుల వినియోగంపై ప్రత్యామ్నాయంగా బయో ఫెర్టిలైజర్లు, నానో ఫెర్టిలైజర్లు, ఆర్గానిక్ ఫెర్టిలైజర్లు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ ప్రణాళికపై శిక్షణ

తుని రూరల్: రైతులతో సమన్వయపర్చుకుని ఖరీఫ్‌కు సమగ్ర వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేయాలని ఏఓ బి.అశోక్‌కుమార్ సూచించారు. గురువారం కొలిమేరు రైతు భరోసా కేంద్రంలో ఏఈఓ, ఎంపీఈఓ, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు ఒక రోజు శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఏ రైతు, ఏ పంటలను, ఎంత విస్తీర్ణంలో సాగు చేయనున్నారో సమగ్రంగా వివరాలు సేకరించాలన్నారు. రైతుల నుంచి ఎరువులు, విత్తనాల డిమాండ్‌ను తెలుసుకోవాలన్నారు. ఆర్బీకేలు వారీగా ఆయా వివరాలను క్రోడీకరించి సమగ్ర వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఏఈఓ జగ్గఅప్పారావు, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పాల్గొన్నారు.

రేపు డీవైఈఓ పోస్టులకు రాత పరీక్ష

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ ద్వారా ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కాకినాడ జిల్లాలో మూడు సెంటర్లలో శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు డీఆర్వో డి.తిప్పేనాయక్ గురువారం తెలిపారు. సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజీ, కాకినాడ అచ్యుతాపురంలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్‌లలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.40 వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు.

చేదెక్కిన తాండ్ర

- ఉపాధి చూపుతున్న తాండ్ర తయారీ కేంద్రాలు
- తగ్గిన మామిడి కాయల కాపు
- ఈ ఏడాది పెరిగిన మామిడి ధర
- కుదేలవుతున్న వ్యాపారులు



కొమ్మనాపల్లిలోని బట్టీలో మామిడి తాండ్ర పోత పోస్తున్న కూలీలు

తొండంగి: మామిడి సీజన్ కావడంతో వేసవిలో పలు మామిడి తాండ్ర తయారీ కేంద్రాల ద్వారా పలువురు కూలీలకు ఉపాధి లభిస్తుంది. మండలంలో మెట్టప్రాంతాలైన రావికంపాడు, పి.ఇచిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, బెండపూడి తదితర ప్రాంతాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. మామిడి కాయల ఉత్పత్తి జరుగుతుండటంతో పీఈ చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లిల్లో తాండ్ర తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఈ పరిశ్రమలు పెరిగాయి. మండలంలోనే ఈ గ్రామాలు అత్యధికంగా తాండ్ర తయారీకి పేరొందాయి. సుమారు 15 వరకూ తయారీ కేంద్రాలు నెలకొల్పారు. కొందరు రైతులు, వ్యాపారులు సంయుక్తంగా మామిడి తోటల్లోనే యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి, వివిధ ప్రక్రియల ద్వారా తాండ్రను తయారు చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలోనూ రోజుకు సుమారు 5 నుంచి 6 టన్నుల కాయలను తాండ్రకు వినియోగిస్తుంటారు.

తయారీ ఇలా..

ముందుగా చెట్ల నుంచి తీసిన కాయలను శుభ్రంగా కోసి, తర్వాత టెంకను వేరు చేస్తారు. అనంతరం ముక్కలను పలుపు యంత్రంలో వేసి గుజ్జును తీస్తారు. గుజ్జును పాకంగా మార్చి, బెల్లాన్ని గుండగా చేసి కలుపుతారు. తరువాత ఎండలో వేసి బట్టీ చాపలపై పొరలుగా ప్రతి పది నిమిషాలకు ఎండ తీవ్రతను బట్టి కూలీలు పొరలుగా పోస్తారు. టన్ను మామిడి కాయలకు సుమారు 3 క్వింటాల బెల్లం వినియోగిస్తుంటారు. రోజుకి సుమారు 13 క్వింటాల బెల్లాన్ని వాడుతారు.

వెయ్యి మందికి ఉపాధి

ఈ మొత్తం ప్రక్రియను చేయడానికి సుమారుగా 80 నుంచి 100 మంది కూలీలు నిత్యం పని చేస్తుంటారు. మామిడి గుజ్జు, బెల్లం కలిసిన పాకం తయారీకి మగ కూలీలు, చాపలపై పోత పోసేందుకు మహిళా కూలీలు పని చేస్తుంటారు. వీటి ద్వారా పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఒక్కొక్క మహిళా కూలీకి రూ.300 నుంచి రూ.350, మగకూలీకి రూ.500 నుంచి రూ.600 వరకూ ఇస్తుంటారు. ఒక్కో తయారీ కేంద్రం ద్వారా రోజుకు సగటున టన్నున్నర నుంచి రెండు టన్నుల వరకూ మామిడి తాండ్ర తయారవుతుంది. వేసవిలో 50 నుంచి 60 రోజుల పాటు మాత్రమే ఈ పని ఉంటుంది. వ్యవసాయ పనులు లేని వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాత్కాలికంగా ఉపాధి లభిస్తుంది.



తాండ్ర తయారీ కోసం సిద్ధం చేసిన మామిడికాయలు

మామిడి ధర రెట్టింపు

తాండ్ర తయారీకి ముఖ్యంగా కలక్టరు రకం ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఏడాది మామిడి చెట్ల నుంచి కాయల దిగుబడి తగ్గడంతో, వీటి ధర గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపు అయింది. టన్ను ధర గత ఏడాది రూ.13 వేలు ఉంటే, ఈ ఏడాది రూ.20 వేల నుంచి రూ.25 వేలకు చేరింది. దీంతో అంతంత లాభాలతో నడిచే మామిడి తాండ్ర పరిశ్రమలు కాయల ధర పెరుగుదల కారణంగా వ్యాపారంలో డిమాండ్ తగ్గిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కాయల ధర రెట్టింపవ్వడంతో పెట్టుబడి పెట్టేందుకు నిర్వాహకులు, వ్యాపారులు కుదేలవుతున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి



కొమ్మనాపల్లి, పీఈ చిన్నాయపాలెం గ్రామాల్లో తయారైన మామిడి తాండ్ర జిల్లాలో పలు ప్రాంతాలకు మాత్రమే కాకుండా ఒడిషా, ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి సుదూర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఈ కేంద్రాల్లో వేసవిలో ఉపాధి కలుగుతుంది.

– స్వామిరెడ్డి ఈశ్వర్, సూర్యనారాయణ ఫుడ్ ప్రోడక్ట్స్, కొమ్మనాపల్లి, తొండంగి మండలం

రెట్టింపైన మామిడి ధరలు



బైక్‌లపై మామిడి తాండ్రను దూరప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతుంటాం. మామిడి కాయల ధర పెరగడంతో తాండ్ర ధర మార్కెట్‌లో పెంచి అమ్మాల్సి ఉంది. దీంతో డిమాండ్ తగ్గింది. పెట్టుబడికి తగినట్టుగా ధర గిట్టుబాటు కావడం లేదు.

– వై.శ్రీను, కొమ్మనాపల్లి, తొండంగి మండలం

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



పుష్కరిణిలో శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా పల్లకీసేవ, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, శ్రీవారి చక్రస్నానం, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణం, ధ్వజారోహణం, కుంభప్రోక్షణ, మహాదాశీర్వచనం, ఆచార్య యాజమాన్య రుత్విక్ సన్మాహం తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. గోవింద మాలధారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూముల వేలం వాయిదా

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో ఉన్న వడిశలేరు గ్రామానికి చెందిన విశ్వేశ్వర స్వామి దేవస్థానం భూముల వేలం వాయిదా వేసినట్టు ఈఓ పి.ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సర్వే నంబర్ 78లో ఉన్న దేవస్థానానికి చెందిన సుమారు 6.12 ఎకరాల భూమిని మూడేళ్ల పాటు కౌలు సాగు చేసుకునేందుకు గురువారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామన్నారు. వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు నిషేధం

- డిప్యూటీ కలెక్టర్ (ఫ్లయింగ్ స్క్వాడ్) ఏవీఎన్ఎస్ మూర్తి



ప్రత్తిపాడులో పెట్రోలు బంక్ యజమానికి సూచనలు ఇస్తున్న ఏవీఎన్ఎస్ మూర్తి

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజ్ విక్రయాలు నిషేధమని కాకినాడ జిల్లా డిప్యూటీ కలెక్టర్ (ఫ్లయింగ్ స్క్వాడ్) ఏవీఎన్ఎస్ మూర్తి స్పష్టం చేశారు. గురువారం ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో పెట్రోలు బంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 150 పెట్రోలు, డీజిల్ బంకులకు లూజు అమ్మకాలు సాగించరాదని ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన 15 రోజుల వరకూ పెట్రోలు, డీజిల్‌ను కేవలం వాహనదారులకు, పెట్రోల్ బంక్ వద్దకు వచ్చిన వాహనాల్లో మాత్రమే నింపాలని బంక్ యజమానులకు ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రత్తిపాడు తహసీల్దార్ ఎస్.నరసింహరావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్సై పి.కృష్ణకుమార్, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలపై చర్యలు

గండేపల్లి: మందుగుండు సామగ్రి తయారుచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు అన్నారు. గండేపల్లి శివారు రంగంపేట వెళ్లే మార్గంలో ఉన్న ఆర్కాఫైర్ వర్క్సును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అలాగే జూన్ 6 వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవని, బాణసంచా తయారీ కానీ, విక్రయించినా కానీ చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.



గండేపల్లిలో మందుగుండు సామగ్రి తయారీదారుడితో సీఐ లక్ష్మణరావు

ఘనంగా ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. హోమం అనంతరం 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవారికి వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, అర్చకులు కంచిబట్ల రామ్‌కుమార్, కోట వంశీ, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్, పరిచారకులు ఫణి తదితరులు హోమాది పూజలు నిర్వహించారు.

నేడు చండీహోమం

వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న భక్తులు రూ.750 చెల్లించి హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

ఘనంగా తంటికొండ వెంకన్న గ్రామోత్సవం



తంటికొండలో వెంకన్న గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి, తూర్పుమెట్ల మీదుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. అనంతరం వాహనంపై ఉంచి డప్పులు, బాజాలు, మేళతాళాలు, బాణసంచా, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు గ్రామంలో స్వామివారిని ఊరేగించారు. అంతకు ముందు ఉదయం తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిర్మానుష్యంగా రహదారులు



తుని పట్టణంలో నిర్మానుష్యంగా మారిన ఓ ప్రధాన రహదారి

తుని: పెరుగుతున్న ఉష్ణతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 11 గంటలకు వడగాడ్పులు వీస్తున్నాయి. గురువారం పట్టణంలోని వ్యాపారులు మధ్యాహ్నం వేళ దుకాణాలు మూసివేసి, సాయంత్రం తెరుస్తున్నారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం, ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శాంతిఆశ్రమం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. శాంతి ఆశ్రమం ఫీడర్ పరిధిలోని శాంతి ఆశ్రమం, పాదురుపాక, గజ్జనపూడి, శరభవరం, యూజీ పురం, వెంకటనగరం, పోతులూరు, వాకపల్లి, బవురువాక, పాండువలపాలెం, చింతలూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

చెట్ల కొమ్మల తొలగింపు కోసం..

గండేపల్లి: సూరంపాలెం, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలోని సూరంపాలెం, రామేశంపేట, యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ రత్నాలరావు తెలిపారు. 11 కేవీ విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ బోర్లకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

అచ్యుతాపురంలో కార్డన్ అండ్ సెర్చ్



గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీ చేస్తున్న ఎస్సై

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో గురువారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా కోరుకొండ సీఐ అడపా నాగమురళి పర్యవేక్షణలో ఎస్సై కె.నాగరాజు, పోలీసు సిబ్బంది ఉదయం గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా రికార్డులు లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రికార్డులు చూపిస్తే యజమానులకు బైక్‌లు అప్పగిస్తామని తెలిపారు.

ఘనంగా బుద్ధ జయంతి

జగ్గంపేట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి (బుద్ధ పూర్ణిమ)ని స్థానిక వాసుదేవనగర్‌లో గురువారం నిర్వహించారు. వాసుదేవ నగర్‌లోని బుద్ధ విహార్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ బుద్ధుని విగ్రహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉల్లం నందిని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ విశ్వ మానవాళికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుని బోధనలు ఆచరణీయమన్నారు. ఆ మహనీయుని బాటలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సాదే నరేంద్రబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శివ, అంజలి దంపతులు

గోకవరం: పెంటపల్లి గ్రామంలో అమ్మ, నాన్న స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు సీబీఐలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన నాగవల్లి శివ, అంజలి దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశయ సాధన కోసం యువత కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు దొడ్డా విజయ్, గండికోట రామకృష్ణ, పల్లిబోయిన గంగబాబు, సంస్థ వ్యవస్థాపకుడు కర్రి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌లో స్విమ్మర్లు



క్రమక్రమంగా భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతోంది. అడపాదడపా వర్షాలతో కాస్తంత సేద తీరిన జనంపై.. కొద్ది రోజులుగా సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. ఈ క్రమంలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు వేడిమి, ఉక్కబోతతో తిప్పలు పడుతున్నారు. ఉదయం నుంచే తీవ్ర రూపం దాల్చుతున్న ఎండలు.. సాయంత్రమైనా తగ్గకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 11 గంటలైతే ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తీవ్రత నుంచి తప్పించుకోవడానికి జనం ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు యువకులు ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా ఉన్న ఏలేరు నదిలో స్నానాలు చేస్తున్నారు. జలకాలాడుతూ యువకులు, పిల్లలు ఉపశమనం పొందుతున్నారు. నదులు, కాలువలు లెక్కచేయక మూగ జీవాలు సైతం నీటిలోనే సేదతీరుతున్నాయి.

– ఏలేశ్వరం

బాలల సంక్షేమానికి ముస్కాన్

కాకినాడ రూరల్: ఇంటి నుంచి పారిపోయిన లేదా తప్పిపోయిన బాలలను ముష్కాన్ ఆపరేషన్ ద్వారా వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చడం లేదా పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్టు జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పేదరికం, చదవడం ఇష్టం లేకపోవడం, సవితి తల్లి పోరు తదితర కారణాలతో చాలామంది పిల్లలు ఇంటి నుంచి పారిపోతున్నారన్నారు. అటువంటి వారిని మాఫియా టార్గెట్ చేసి, నేరస్తులుగా మార్చి సమాజంపై వదులుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. దీని నివారణకు పోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ సంస్థల వద్ద వీధి బాలలను కార్మికులుగా గుర్తిస్తామన్నారు. ఎవరికైనా భిక్షటన చేస్తున్న పిల్లలు, తప్పిపోయిన పిల్లలు తారసపడితే 100, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.